ఆనకట్టలు శిథిలం.. సాగు ప్రశ్నార్థకం!

- శిథిలావస్థలో గోకివాడ, ఏడుముళ్ల ఆనకట్టలు
- గేట్లు లేక సముద్రంలోకి వృథాగా పోతున్న శారదానది నీరు
- 3 వేల ఎకరాల ఆయకట్టుకు అందని నీరు
- ఆనకట్టలు దెబ్బతినడంతో ఏటా వరద ముంపులో వరి పొలాలు


శిథిలావస్థలో గోకివాడ శారదానది ఆనకట్ట


పాడైన కొత్తూరు వద్ద ఏడుముళ్ల ఆనకట్ట

రాంబిల్లి(యలమంచిలి): ప్రధాన నీటి వనరులైన ఆనకట్టలు శిథిలావస్థకు చేరడంతో పంట పొలాలకు సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఆనకట్ల వద్ద గేట్లు లేక శారదానది నీరు సముద్రం పాలవుతోంది. ఆరుగాలం కష్టపడి పంటలు వేసుకున్న రైతులకు సకాలంలో పంట కాలువల ద్వారా నీరు అందక అవస్థలు పడుతున్నారు. రాంబిల్లి మండలంలో పంటలకు ప్రధాన ఆధారమైన శారదానదిలో ఉన్న గోకివాడ, ఏడుముళ్ల ఆనకట్టలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొత్తూరు, గోకివాడ గ్రామాల్లో బ్రిటిష్ కాలంలో ఈ ఆనకట్టలను నిర్మించారు. శారదా నదిని ఆనుకుని మండలంలో 3 వేల ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. చాలా కాలంగా కొత్తూరు గ్రామం వద్ద ఉన్న ఏడుముళ్ల ఆనకట్టు, గోకివాడ గ్రామం వద్ద ఉన్న ఆనకట్టలు శిథిలావస్థలోకి చేరుకోవడంతో శారదానదిలో నీరు సముద్రంలోకి వృథాగా పోతోంది. తొలకరిలో వర్షాలకు నీటి నిల్వలు లేకపోవడంతో రైతులు పంటలు వేసుకోలేకపోతున్నారు. గోకివాడ ఆనకట్టకు గేట్లు లేకపోవడంతో ఏగువ నుంచి వచ్చే నీరు సముద్రంలోకి వెళ్లిపోతుంది. దీంతో సమీపంలో ఉన్న పంట పొలాలకు నీరందక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. గతేడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్పందించి ఆనకట్టల నిర్మాణానికి వ్యయ ప్రణాళిక సిద్ధం చేసి పంపించాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించింది. అయితే ప్రతిపాదనలు పంపించడంలో అధికారులు ఆలస్యం చేయడంతో నిధులు మంజూరులో జాప్యమైంది. మంజూరైన నిధులు మురుగన పడిపోయాయి. ఇంతలో ఎన్నికలు సమీపించడం.. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో రైతుల ఆశలు అడియాసలయ్యాయి.

ఏడుముళ్ల ఆనకట్టతో పొంచి ఉన్న ముప్పు

ఇటీవల ఏడుముళ్ల ఆనకట్ట మరమ్మతులకు రూ.40 లక్షల నిధులు మంజూరయ్యాయి. పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలంటే ఈ నిధులు సరిపోని పరిస్థితి నెలకొంది. మరమ్మతులు చేపట్టినా ఆనకట్ట దృఢంగా ఉంటుందో లేదో చెప్పలేమని అధికారులు అంటున్నారు. కొత్త ఆనకట్ట నిర్మాణానికి సుమారు రూ.60 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌తో చర్చించి ప్రభుత్వానికి పంపిస్తున్నామని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఏడుముళ్ల ఆనకట్ట సమీపంలో శారదానది గట్టుకు గండి పడింది. దీంతో కొత్తూరులోని పంట పొలాలను వరద నీరు ముంచెత్తింది. ఇలా ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వరద ఉధృతికి దెబ్బతిన్న గట్లను రైతులు ఇసుక బస్తాలతో తాత్కాలికంగా రక్షణ గట్టు ఏర్పాటు చేసుకున్నారు. రాంబిల్లి మండలంలో సాగుకు ప్రధాన నీటి వనరులైన గోకివాడ, ఏడుముళ్ల ఆనకట్టలను ఆధునికీకరించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


గోకివాడ ఆనకట్ట వద్ద మరమ్మతులకు గురైన గేట్లు

గోకివాడ ఆనకట్టకు మరమ్మతులు చేపట్టాలి



గోకివాడ ఆనకట్ట శిథిలావస్థకు చేరుకోవడంతో పంటలకు సరిగ్గా నీరు అందడం లేదు. గ్రోయిన్ దెబ్బతినడం, గేట్లు పాడై పోవడంతో నీటి నిల్వలకు అవకాశం ఉండడం లేదు. శారదానది గట్టుకు అవతల సోమలింగపాలెం, ఇవతల గోకివాడ, మూలకొత్తూరు, మూలజంప గ్రామాల రైతులు వరి, చెరకు పంటలను శారదానదిపై ఆధారపడి సాగు చేస్తుంటారు. ఆనకట్ట మరమ్మతుల కోసం గతంలో ఎన్నో సార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదు.

– ద్వారపురెడ్డి నాగేశ్వరరావు, గోకివాడ గ్రామం

ఏడుముళ్ల ఆనకట్టను పునర్నిర్మించాలి



శిథిలావస్థలో ఉన్న ఏడుముళ్ల ఆనకట్టను పునర్నిర్మించాల్సిన అవసరం ఉంది. ఏటా వరదల తాకిడికి ఏడుముళ్ల ఆనకట్ట దెబ్బతినడంతో సమీపంలో ఉన్న పంట పొలాలు నీట మునిగిపోతున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కొత్తగా ఆనకట్టను నిర్మించి రైతులను ఆదుకోవాలి.

– కన్నం రమణారావు, కొత్తూరు గ్రామం

ఆనకట్టల నిర్మాణానికి ప్రతిపాదనలు

రాంబిల్లి మండలంలో గోకివాడ ఆనకట్టు, కొత్తూరు వద్ద ఉన్న ఏడుముళ్ల ఆనకట్టల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతున్నాం. కొత్తూరు ఏడు ముళ్ల ఆనకట్ట నిర్మాణానికి రూ.60 కోట్ల వరకు అవసరం. ప్రస్తుతం రూ.40 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో పనులు చేపట్టడం కష్టం. ప్రస్తుతం శారదా నదిలో నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో పనులు ప్రారంభించ లేదు.

– కె.శివాజీ, ఇరిగేషన్ ఏఈ, రాంబిల్లి మండలం

క్లుప్తంగా

క్యాన్సర్‌పై అవగాహన అవసరం


క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న సర్వసిద్ధి వైద్యాధికారి శక్తిప్రియ

ఎస్.రాయవరం: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సర్వసిద్ధి వైద్యాధికారి శక్తిప్రియ అన్నారు. మండల కేంద్రం ఎస్.రాయవరంలో శుక్రవారం క్యాన్సర్ వాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, పురుషుల్లో సర్వసాధారణంగా వచ్చే క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే నివారణ సాధ్యమేనన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి


చూచుకొండలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. మండలంలోని చూచుకొండలో శుక్రవారం రెవెన్యూ సదస్సులో భాగంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ–సర్వేలో జరిగిన లోపాలను సవరించడంతో పాటు తేడాలు సరిచేసేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ దొడ్డి సూరప్పారావు, ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్, రీ–సర్వే డీటీ పడాల్, ఆర్‌ఐ కిషోర్, వీఆర్వో హిమబిందు, కాండ్రేగుల నాయుడు, శ్రావణ్‌కుమార్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు


వాడ్రాపల్లిలో పింఛన్ అందజేస్తున్న డీఎల్‌డీవో మంజులావాణి

మునగపాక: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందజేస్తామని డీఎల్‌డీవో మంజులావాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని జరుగుతున్న పింఛన్ల పంపిణీలో భాగంగా ఆమె వాడ్రాపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులకు సకాలంలో పింఛన్ అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ సోమరాజు, మళ్ల వరహా నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

మకరతోరణం ఏర్పాటుకు రూ.25 వేలు విరాళం


రూ.25 వేలు విరాళం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షులు ప్రసాద్

మునగపాక: మునగపాకలోని వేపచెట్టు వద్ద ఉన్న సీతారాముల ఆలయంలో మకరతోరణం ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తన వంతుగా రూ.25వేల విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా గురువారం రాత్రి ఆలయ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావుకు ఈ మేరకు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆడారి అప్పలనాయుడు, రమణబాబు, రాజు, దాడి అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి


శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: ప్రతి ఒక్కరూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు పాటు పడాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో పొట్టి శ్రీరాముల చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ కోసం శ్రీరాములు ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దాసరి అప్పారావు, మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరహా, ఎంపీటీసీ సభ్యుడు సూరిశెట్టి రాము, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కోనపల్లి రామ్మోహనరావు, మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, ఆడారి కృష్ణ, కాండ్రేగుల జగన్, ఆడారి లక్ష్మణరావు, కొండకర్ల శివ, పల్లె అప్పలనాయుడు, రాపేటి పరమేష్, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ కంచాలతో అభిజిత్ కార్మికుల నిరసన


ఖాళీ కంచాలతో నిరసన తెలుపుతున్న అభిజిత్ కార్మికులు

అచ్యుతాపురం: సెజ్‌లోని అభిజిత్ కార్మికులు ఖాళీ కంచాలతో గురువారం దీపావళి రోజున నిరసన వ్యక్తం చేశారు. కంపెనీని అక్రమంగా లే ఆఫ్ ప్రకటించడంతో తమ కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులు ఆర్.రాము, కె.సోమునాయుడుల ఆధ్వర్యంలో కార్మికులు అభిజిత్ పరిశ్రమ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 18 రోజులుగా ఆందోళన చేస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదంటూ వాపోయారు. సుమారు 1000 మంది కార్మికుల కుటుంబాల్లో దీపావళి రోజున సైతం చీకట్లు అలముకున్నాయంటూ ఖాళీ కంచాలతో చేపట్టిన నిరసనకు పలువురు సంఘీభావం తెలిపారు. రైతులు తక్కువ ధరకు భూములిచ్చినా ఈ రోజున ఉపాధి లేకుండా పోయిందని, తక్షణమే యాజమాన్యం స్పందించి ఆదుకోవాలని కార్మికులు కోరారు.

ప్రొటోకాల్‌ను తుంగలోకి తొక్కి.. సర్పంచులను పక్కన పెట్టి..

- కూటమి నేతలతో పనులు చేపట్టడం తగదు
- ఎంపీడీవోకు సర్పంచుల వినతి


ఎంపీడీవో కాశీవిశ్వనాధరావుకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ మద్దతు సర్పంచులు

కోటవురట్ల: కూటమి ప్రభుత్వం చెప్పే కోతలు కోటలు దాటుతాయే తప్ప చేతల్లో మాత్రం సున్నా అని మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు విమర్శించారు. మండలంలోని వైఎస్సార్ సీపీ మద్దతు సర్పంచులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే పనులను సర్పంచుల ప్రమేయం లేకుండా కూటమి నాయకులతో ఎలా చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి ఆధ్వర్యంలో సర్పంచులు ఎంపీడీవో కాశీ విశ్వనాధరావుకు వినతిపత్రం అందించారు. మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ పంచాయతీలను పరిపుష్టి చేస్తున్నాం, సర్పంచులకు గౌరవం కల్పిస్తున్నామంటూ ఉత్తుత్తి కబుర్లు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. వాస్తవానికి రాష్ట్ర వ్యాప్తంగా అధిక శాతం పంచాయతీలలో వైఎస్సార్ సీపీ మద్దతు సర్పంచులే ఉన్నారని, వారిని కాదని ప్రొటోకాల్‌ను పక్కన పెట్టి కూటమి నాయకులతో అధికారిక పనులు చేయిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తీరుతో పంచాయతీరాజ్ వ్యవస్థ రాజకీయ కంపుతో వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతోందన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచులకు తగిన ప్రాధాన్యం కల్పిస్తూ ప్రభుత్వ పనుల్లో వారిని మాత్రమే భాగస్వామ్యం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, సర్పంచులు పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్‌తో ఇంటింటికీ తాగునీరు


ఇంటింటా కొళాయి పనులు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు దొడ్డి కోటేశ్వరరావు

మునగపాక: జల జీవన్ మిషన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు దొడ్డి కోటేశ్వరరావు కోరారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి సూచన మేరకు శుక్రవారం గవర్ల అనకాపల్లిలో జరుగుతున్న ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా తాగునీరు ఇంటింటికీ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తోటాడ పంచాయతీలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు కాండ్రేగుల వెంకటలక్ష్మి, పొలమరశెట్టి మురళీ, దాడి శ్రీనివాసరావు, దాడి వీరమహాలక్ష్మి నాయుడు, చదరం భాస్కరరావు, ఆళ్ల వెంకటేష్, సూరిబాబు, రాము, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాంబిల్లి–వెంకటాపురం జంక్షన్ రహదారిని నిర్మించాలి

- సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన
- రాంబిల్లిలో ప్రధాన రహదారి దిగ్బంధం


రాంబిల్లి రోడ్డులో ఆందోళన చేస్తున్న సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి, వెంకటాపురం జంక్షన్ మధ్య ఉన్న ప్రధాన రహదారి నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు కోరారు. రాంబిల్లి నుంచి వెంకటాపురం జంక్షన్, నేవీ ప్రాజెక్ట్ వరకు రోడ్డు పూర్తిగా గోతులమయమైందని, తక్షణం పునర్నిర్మాణం చేపట్టాలని శుక్రవారం ప్రజా సంఘాలు, సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో రాంబిల్లి మండల కేంద్రంలో ప్రధాన రహదారిని దిగ్బంధించారు. నాలుగు వైపులా వాహనాలను అడ్డుగా పెట్టి నేవల్ బేస్‌కు వెళుతున్న బండ రాళ్ల లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాంబిల్లి నుంచి వెంకటాపురం జంక్షన్ వరకు రోడ్డు గోతులు పడి రాళ్లు తేలాయని, తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని దేముడునాయుడు మండిపడ్డారు. కొత్త రోడ్డు నిర్మాణం జరిగే వరకు రోడ్డుపై ధూళి ఎగిసిపడకుండా నీటితో తడపాలని కోరారు. వేల కోట్ల రూపాయలతో నేవీ ప్రాజెక్ట్ చేపడుతున్న ప్రభుత్వం ఆ ప్రాజెక్టుకు వెళ్లే రోడ్డును రూ.10 కోట్లు ఖర్చుపెట్టి నిర్మించలేకపోతుందని చెప్పారు. రాంబిల్లి ప్రధాన రహదారిని ఉదయం 8 నుంచి 9 గంటల వరకు దిగ్బంధించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల అధ్యక్షుడు గంగరాజు, సీఐటీయూ మండల కన్వీనర్ చందక రామకృష్ణ, ఆటో కార్మికులు, కొబ్బరి ఒలుపు కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, షాపుల యజమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాటిపల్లి మాజీ సర్పంచ్ పరాల్ మృతికి సంతాపం


కొయ్య పరాల్(ఫైల్)

మునగపాక: మండలంలోని పాటిపల్లి మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత కొయ్య పరాల్(63) గుండెపోటుతో గురువారం సాయంత్రం మృతిచెందారు. పాటిపల్లి పంచాయతీకి మూడు సార్లు సర్పంచ్‌గా ఆయన సేవలందించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరాల్ అంతిమ యాత్ర శుక్రవారం గ్రామంలో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల నాగప్పారావు, ఎంపీటీసీ సభ్యులు మద్దాల వీరునాయుడు, ఇల్లా శిరీషా, మాజీ ఎంపీపీలు మొల్లేటి సరళ, కొయిలాడ వెంకట్, వెంకటాపురం మాజీ సర్పంచ్ సుందరపు కనకప్పారావు, తదితరులు పరాల్ మృతికి సంతాపం తెలిపారు.

కెమెస్ట్రీ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న రసాయన శాస్త్రం అతిథి ఉపన్యాసకుని పోస్టు భర్తీ కోసం అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసే అభ్యర్థులు రసాయన శాస్త్రం పీజీ కోర్సులో 55 శాతం మార్కులు దాటి ఉండాలని, యూజీసీ నెట్, స్టేట్ స్లెట్, పీహెచ్‌డీ కలిగిఉండాలని పేర్కొన్నారు. అనుభవం గల వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు తెలిపారు. పై అర్హతలు కలిగి ఉన్నవారు ఈనెల 5వ తేదీ సాయంత్రం లోగా కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, 6వ తేదీ ఉదయం 10 గంటలలకు కళాశాలలో జరగనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

అంబరాన్నంటిన దీపావళి సంబరాలు


మునగపాకలో దివ్వెలు వెలిగిస్తున్న భక్తులు


కొరుప్రోలులో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నక్కపల్లి/కోటవురట్ల/మునగపాక/ఎస్.రాయవరం: దీపావళి పండగను ప్రజలు గురువారం ఘనంగా జరుపుకొన్నారు. టపాసులు కాల్చి ఆనందోత్సాహలతో గడిపారు. సాయంత్రం తమ ఇళ్లల్లో కుబేర, ధనలక్ష్మి వ్రతమాచరించారు. లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. దీపాల కాంతులతో లోగిళ్లు దేదీప్యమానంగా వెలిగిపోయాయి. ఆలయాల వద్ద దీపారాధన కనువిందు చేసింది. బాణసంచా పేలుళ్లతో చిన్నారులు, పెద్దలు కేరింతలు కొట్టారు. కుటుంబ సమేతంగా దివ్వెలు కొట్టి దీపావళి వేడుకను సంప్రదాయబద్ధంగా జరుపుకొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన


శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

యలమంచిలి రూరల్: ఉచిత వైద్య శిబిరాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి వీలు పడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాత సినిమా హాలు వద్ద ఏబీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ శిబిరంలో భాగంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని, వైద్య పరీక్షల తీరును ఆమె పరిశీలించారు. ప్రజలకు ఉపయోగపడేలా సేవలందిస్తున్న ట్రస్టు నిర్వాహకులను రమాకుమారి అభినందించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎంఎస్ శాంతి స్వరూప్ మాట్లాడుతూ సమాజంలో పేద, బలహీన వర్గాల ప్రజలకు సేవలందించడమే లక్ష్యంగా తమ ట్రస్ట్ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ శిబిరంలో సాధారణ పరీక్షలతో పాటు క్యాన్సర్ ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు కూడా నిర్వహించారు. మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి, నర్సింగబిల్లి మరిడి మహాలక్ష్మి ఉత్సవ కమిటీ యువకులు, విశాఖ ఎంవీపీ అనిల్ నీరుకొండ ఆస్పత్రి, గాజువాక వందే భారత్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 500 మందికి పైగా వైద్య పరీక్షలు, 54 యూనిట్ల రక్తం సేకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ పార్టీ భీం ఆర్మీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, మరిడి మహాలక్ష్మి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తొట్టా నాగ శ్రీనివాస్ 20 మంది వైద్యులు, పలువురు యువకులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి నిలుపు మహోత్సవం


గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవంలో కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం సతకంపట్టు గౌరీపరమేశ్వరుల అమ్మవారి నిలుపు మహోత్సవాన్ని గురువారం రాత్రి చేపట్టారు. అంతకు ముందు జాతీయ రహదారిలో వరి పొలంలో వరి దుబ్బును తీసుకువచ్చి అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసి, అక్కడి నుంచి గౌరీపరమేశ్వరులను గవరపాలెం పురవీధుల గుండా ఊరేగించి శుక్రవారం తెల్లవారు జామున అమ్మవారి ఆలయంలో నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు మాట్లాడుతూ కార్తీకమాసంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ఆలయ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల నూక మహాలక్ష్మి నాయుడు, ఆలయ ప్రతినిధులు కొణతాల మురళీకృష్ణ, పీవీవీ రమణ, కొణతాల ప్రసాద్, దాడి కృష్ణ, కొణతాల చంద్రశేఖర్, మద్దాల శంకరరావు, పెంటకోట వెంకట సత్యనారాయణ, కోరుబిల్లి సత్యనారాయణ, పెంటకోట జగదీష్, కాండ్రేగుల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

సుగర్ వ్యాధి నిర్మూలనలో యోగా పాత్ర అద్భుతం


యోగా గురువు పూజ్య స్వామి రిత్ దేవ్‌జీ మహరాజ్, దొరమ్మనాయుడు

తుమ్మపాల: సుగర్ వ్యాధిని మానవ శరీరం నుండి తరిమి కొట్టే సాధనలో భాగంగా యోగ అద్భుతంగా పని చేస్తుందని, యోగాతో శరీరాన్ని ఆయుధంగా మార్చుకుంటే ఆరోగ్యం మన సొంతమవుతుందని పూజ్య స్వామి రిత్ దేవ్‌జీ మహరాజ్ అన్నారు. పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 6 వరకు జార్జి క్లబ్‌లో ఉన్న పతంజలి యోగ సెంటర్‌లో సుగర్ వ్యాధి తగ్గించుకునేందుకు ఐదు రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మనాయుడు తెలిపారు. పతంజలి యోగ్‌పీఠ్, హరిద్వార్, పూజ్య స్వామి రిత్ దేవ్‌జీ మహరాజ్ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు శిక్షణ అందజేస్తారన్నారు. ప్రతిరోజు తెల్లవారి 5.30 నుండి 7.30 వరకు తరగతులు జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు జి. మంగయ్యను 9848521738 నంబర్‌లో సంప్రదించాలన్నారు.